



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

బాబా పేరుతో ఘరానా మోసం

- కుటుంబ సమస్యలు ప్రాయశ్చిత్తమంటూ బురిడీ - రూ 50 వేలతో ఉడాయించిన వైనం
- ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోని పోలీసులు - వీడియో వైరల్ అవడంతో రంగంలోకి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సామాన్య ప్రజల సమస్యలను వారి అమాయకత్వాన్ని అడ్డుగా పెట్టుకుని కొంతమంది బాబాల ముసుగులో మోసం చేస్తున్న వైనం ప్రస్తుతం కర్నూలు నగరంలో బయటపడుతోంది. కుటుంబ సమస్యలకు తమ మంత్ర తంత్రాలతో ప్రాయశ్చిత్తం చేస్తామంటూ నమ్మబలికి ఓ అమాయక కుటుంబం నుంచి రూ. 50 వేలు తీసుకొని ఉడయించిన దొంగ బాబాల వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు నగరం సాయిబాబా థియేటర్ వెనక లక్ష్మీ సింగ్ కాలనీకి చెందిన పద్మబాయ్, ఆమె కోడలు శిరీష ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన ఇద్దరు వ్యక్తులు శుక్రవారం ఉదయం సుమారు 9:30 గంటల ప్రాంతంలో బియ్యం యాచించారు. కోడలు శిరీష ద్వారా కుటుంబంలోని కొన్ని సమస్యలను, కుటుంబ సభ్యుల వివరాలను అత్తకు తెలియకుండా తెలుసుకున్నారు. తెలుసుకున్న అదే విషయాలను అత్త పద్మాబాయ్‌కి వివరించారు. తమ కుటుంబంలోని సమస్యలను నిక్కచ్చిగా చెప్పడంతో వారిని పద్మాబాయి పూర్తిగా విశ్వసించింది. పద్మాబాయి తన పెద్ద కొడుకు కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నాడని, ఆయనకు భవిష్యత్తులో తీరని ముప్పు వాటిలనుందని భయభ్రాంతులకు గురిచేశాడు. కొడుకుపై ఉన్న మమకారంతో ఎలాగైనా ఈ గండాన్ని గట్టెక్కించమని వారిని ప్రాధేయపడింది. ఇదే అదనుగా భావించిన సదరు దొంగ బాబాలు గండం తప్పించాలంటే కొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించాలని అది ఖర్చుతో కూడుకున్నదని చెప్పారు. రూ. 30,000 తొలుత స్వీకరించారు. ఇది కాకుండా 11 మంది బాలలతో పూజ చేయించాలని అన్నారు. బాలల్ని తీసుకురావడానికి కూడా మరో రూ.20,000 ఖర్చవుతుందని అన్నారు. ఈ సొమ్ము సమకూరుస్తే అది కూడా తామే నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీంతో ఆమె రూ. 20 వేలను కూడా వారికి చెల్లించింది. జాతకం చెప్పే పేరుతో ఆమె చేతిని తీసుకొని అరచేతిలో ఏదో రసాయనం పోయడం ద్వారా ఆమె తన ఆలోచన శక్తి కోల్పోయి అతను చెప్పినదానికల్లా తలాడించినట్లు బాధిత మహిళలు పేర్కొన్నారు. ఈ పూజలు అస్సాంలోని కోణార్క్‌లో నిర్వహించాల్సి ఉంటుందని చెప్పి డబ్బు తీసుకొని పరారయ్యారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమకు తెలియజేయలంటూ ఫోన్ నెంబర్ కూడా ఇచ్చి వెళ్లినట్లు తెలుస్తుంది. కొద్దిసేపటికి చేరుకున్న సదరు మహిళలు కొంత అనుమానం వచ్చి వారికోసం చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మోసపోయామని అసలు విషయం తెలుసుకున్న బాధిత మహిళలు స్థానిక టు టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.



మాట్లాడుతున్న బాధితులు

ఫిర్యాదు ఇచ్చిన పట్టించుకుని పోలీసులు

బాధిత మహిళలు ఘటన జరిగిన అదే రోజు ఉదయం సుమారు పదిన్నర గంటలకు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. వారి వద్ద నుంచి వివరాలు ఫోన్ నెంబర్ తీసుకొని ఉన్న పోలీసులు సమస్య వస్తే తమకు ఫోన్ చేయాలని సరిది చెప్పి పంపించారు. సదరు మోసగించిన వ్యక్తులు మీకు అందుబాటులోకి వస్తే తమకు సంప్రదించాలని చెప్పారు. కాగా అదే వ్యక్తి కి బాధితులు శనివారం ఉదయం ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని ప్రశ్నించగా ఫలానా ప్రాంతంలో ఉన్నామని వారు సెలవిచ్చారు. ఈ విషయాన్ని పోలీసులకు బాధితురాలు ఫోన్లో చేరవేసిన ఎలాంటి స్పందన లేకపోగా వాళ్ల అబద్ధాలు చెప్పి ఉంటే ఎలా అంటూ ఎదురు ప్రశ్నలు వేస్తూ తమను నీరుగార్చారని స్వయంగా బాధితురాలే వెల్లడించారు. ఇదిలా ఉంటే స్టేషన్లో బాధితులు ఏమైనా ఫిర్యాదు చేశారా అని ప్రజాశక్తి టూ టౌన్ పోలీసులను అడుగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పడం గమనార్హం. ఇదే ఘటనకు సంబంధించి ఓ వీడియో ఓ ప్రయివేట్ చానల్లో వైరల్ అయిన నేపథ్యంలో అప్పటికప్పుడు పోలీసులు శనివారం సాయంత్రం బాధితుల ఇంటి వద్దకు వెళ్లి మరో స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వాలని కోరారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి ప్రమాదాలను నివారించాలి
- ఎస్పీ బిందుమాధవ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆర్‌టిసి, ట్రాన్స్‌కో, నేషనల్ హైవే అథారిటి, మున్సిపల్, పోలీసు, ఇతరశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కర్నూలు పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నివారించాలని, ప్రమాదాలు జరగకుండా చూడాలని కర్నూలు జిల్లా ఎస్పి జి.బిందుమాధవ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. రహదారుల భద్రతకు అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమైన రహదారులలో, రద్దీ ప్రాంతాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. నేర నివారణకు దోహదపడతాయన్నారు. పని చేయని సిసి కెమెరాల లోటు పాట్లు తెలుసుకుని పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మలుపుల వద్ద బారికేడ్లు, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. కర్నూలు నగరంలో ఆటోలు ఇతరులకు ఇబ్బంది లేకుండా ఫ్రీలెఫ్ట్‌గా వెళ్ళేందుకు ఒక రూట్‌లో వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు ఆర్‌టిసి బస్టాండ్‌లోకి వెళ్ళి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించుకునే విధంగా ఆటోలకు ఒక స్థలం కేటాయించే విధంగా పరిశీలన చేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలిగే విధంగా ప్రయాణికులను ఎక్కించుకునే సమయంలో రోడ్ల మధ్యలో బస్సులు, ఆటోలు నిలపకుండా , రోడ్డు ప్రక్కకు , ఒక సైడ్ వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు రైల్వే స్టేషన్‌కు గూడ్స్ రైళ్ళలో వచ్చే రైస్ (బియ్యం)ను గోడౌన్లకు తరలించే లారీలు, కర్నూలు పట్టణంలో రాత్రి వేళ మాత్రమే తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని రద్దీ ప్రాంతాలలో సర్కిళ్ళ మధ్యలో నిర్మాణాలు జరుగుతుంటే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా త్వరగా పూర్తి చేసే విధంగా మున్సిపల్ శాఖ వారు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది కలిగే విధంగా కరెంట్ పోల్స్ ఉంటే వాటిని కూడా పరిశీలించాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం పై తీసుకోవలసిన ఇతర చర్యల పై ట్రాఫిక్ సిఐకి పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు ఎస్పి సూచనలకు సానుకూలంగా స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించే విధంగా అన్ని రకాల చర్యలను సమన్వయంతో తీసుకుంటామని ఎస్పి హామీఇచ్చారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు మహబూబ్‌నగర్, కడప, అనంతపురం డివిజనల్ అధికారులు, మున్సిపల్ అధికారులు డిప్యూటి సిటి ప్లానర్ సంధ్యారాణి, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరి, రాజు, ఎఇ ప్రవీణ్, బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ శబరీష్, ఆర్టిసి ఆర్‌ఎం. శ్రీనివాసులు, ట్రాఫిక్ సిఐ గౌతమి, డిటిఆర్‌బి సిఐ ఆదినారాయణ రెడ్డి, ట్రాన్స్‌కో అధికారులు , సిఐ పార్థసారథి రెడ్డి, ఎస్ఐ ఊమాపతి ఉన్నారు.



105 టిఎంసిలకు చేరిన నీటి నిల్వ

- 1,00,871 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- డ్యామ్ 28 గేట్ల ద్వారా 1,07,035 క్యూసెక్కుల నీరు దిగువకు
- ప్రమాద హెచ్చరికలు జారీ

ప్రజాశక్తి - హోళగుంద

హోస్పేట్‌లోని తుంగభద్ర డ్యామ్ నీటి నిల్వ 105 టిఎంసిలకు చేరింది. ప్రస్తుతం 1,00,871 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో డ్యామ్‌కు వచ్చి చేరుతోంది. డ్యామ్ 28 గేట్ల ద్వారా 1,07,035 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, ధవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు వరద పోటెత్తింది. ప్రస్తుతం రోజుకు 1,00,871 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సితో పాటు నదికి 1,16,026 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు కూడా జారీ చేశారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 105 టిఎంసిల నీటి నిల్వ ఉంది. డ్యామ్ అడుగులు 1631.98. వరద ఇలాగే కొనసాగితే ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని శనివారం బోర్డ్ సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడండి

- పిపిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఈ పుల్లారెడ్డి
- కలెక్టరేట్ ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలో వీధి కుక్కల ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే వాటిని నియంత్రించాలని పట్టణ పౌసంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ. పుల్లారెడ్డి డిమాండ్ చేశారు.

వీధి కుక్కల నుండి ప్రజల ప్రాణాలను కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు కాలనీల ప్రజలతో కలిసి శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆ సంఘం నాయకులు ఎం నాగరాజు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. పుల్లారెడ్డి , మాజీ కార్పొరేటర్ ఎ. బాలరాజు,హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.మోయిన్ మాట్లాడుతూ కుక్కల దాడి నుండి ప్రజలను కాపాడాలన్నారు. కుక్కలను చంపకూడదని ఆదేశాలు ఉన్నందువల్ల వాటికి కుటుంబ నియంత్రణ చేసేవారని అన్నారు. గత కొన్ని ఏళ్ల నుండి స్థానిక సంస్థల అధికారులు, పాలకవర్గాలు పట్టించుకో నందున ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా కుక్కలు ఉన్నాయన్నారు. కిరాణం షాపులకు, స్కూళ్లకు వెళ్లి వచ్చేటప్పుడు చిన్నపిల్లలపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు కావలసిన ఇంజక్షన్లు దొరకడం లేదని ఒక ఎమ్మెల్యే శాసనసభలో ప్రభుత్వం దష్టికి తెచ్చారన్నారు. నగరంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కుక్కలు వెంటపడి కాళ్ళను గాయపరచడంతో కిందపడి మరిన్ని గాయాలకు గురైన జోహారాపురానికి చెందిన చెన్నకేశవులు తీవ్రఅస్వస్థతకు గురయ్యారన్నారు. కుక్కల సమస్యపై ప్రభుత్వం స్పందించాలన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కర్నూలులో కుక్కల నుండి నగర ప్రజలను కాపాడాలని డిఆర్ఒకు వినతి పత్రం ఇచ్చారు. నగరపాలక సంస్థ కమీషనర్‌తో మాట్లాడి కుక్కల సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. వివిధ కాలనీలకు చెందిన వారు ఎస్.మక్బుల్, ఎస్ జానీ, కె. శ్రీనివాసులు, ఎస్.షరీఫ్, ఎస్.సిరాజ్, ఎండి.యూనుష్, టి విజయ్, ఎస్ఆర్ గౌడు, డి.ప్రభాకర్ రెడ్డి, సివి వర్మ, షేక్ అహ్మద్,కె.వెంకట్ రాముడు,పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

నిరాశ..!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి


ప్రతి సారీ లాగే ఈసారి కూడా కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులకు నిరాశే మిగిలింది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. రూ.48,20,512 కోట్లు బడ్జెట్ అంచనా వ్యయంగా పేర్కొన్నారు. రూ.11,11,111 కోట్లు మూలధన వ్యయంగా ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్, విద్యుత్, నీరు, రోడ్లు వంటి సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తామన్నారు. ఎంత ఇస్తారనేది స్పష్టతనివ్వలేదు. వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజీ ఇస్తామని పేర్కొన్నారు. ఎంత ఇస్తారనేది స్పష్టత లేదు. ట్రిపుల్ ఐటి డిఎం అభివృద్ధికి నిధులు ఇస్తామన్నా ఎంత ఇస్తారనేది స్పష్టత లేదు. రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చిన్నచూపు చూసింది. కొత్త రైళ్లు, కొత్త రైల్వే లైన్లకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ గతంలో రైలు ఉండగా దాన్ని రద్దు చేశారు. దాన్ని తిరిగి నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండడంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గుతుంది. జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం, కర్నూలు - శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. బడ్జెట్‌లో వీటి ప్రస్తావన ఏ మాత్రం లేకుండా పోయింది. కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యమే.

జలాశయాలకు పోటెత్తిన వరద...

శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలకు వరద నీటి ప్రవాహం పోటెత్తింది. ఎగువన ఆల్మట్టి, జూరాల జలాశయాల గేట్లను ఎత్తి కిందికి నీటిని విడుదల చేస్తుండడంతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతున్నాయి. జూరాల, సుంకేసుల నుంచి నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతున్నాయి. ఈనెల చివరి నాటికి శ్రీశైలం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోనుంది. అప్పుడు డ్యామ్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. మరో వైపు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు వరద నీరు పోటెత్తింది. తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లాలోని తుంగభద్ర నది నీటితో కళకళలాడుతోంది.

జెసిల బదిలీ...

కర్నూలు, నంద్యాల జిల్లాల జాయింట్ కలెక్టర్లు బదిలీ అయ్యారు. కర్నూలు జెసి నారపురెడ్డి మౌర్య, నంద్యాల జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న నారపురెడ్డి మౌర్యను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నంద్యాల జెసిగా పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి విష్ణు చరణ్‌ను నియమించారు. ప్రస్తుత నంద్యాల జెసిని సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. కర్నూలు జెసిగా ఎవరనేది ఇంకా ప్రకటించలేదు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ కూడా బదిలీ అయ్యారు. ఆయనను గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదట ఐఎఎస్, ఐపిఎస్, ఆ తర్వాత జాయింట్ కలెక్టర్ల బదిలీ ప్రక్రియను చేపట్టింది.



డిపార్టుమెంట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 28 నుంచి ఆగస్టు 2 వరకు నిర్వహించనున్న డిపార్టుమెంట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను డిఆర్ఒ మధుసూదన్‌రావు ఆదేశించారు. డిఆర్ఒ ఛాంబర్‌లో జిల్లాలో నిర్వహించనున్న డిపార్టుమెంట్ పరీక్షల సమీక్ష నిర్వహించారు. డిఆర్ఒ మాట్లాడుతూ మే 2024 సెషన్ డిపార్టుమెంట్ పరీక్షలకు సంబంధించి జిల్లా కేంద్రమైన సనత్ నగర్ ఐఒఎన్ డిజిటల్ స్కూలులో ఉదయం , మధ్యాహ్నం నిర్వహించనున్న డిపార్టుమెంట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రం వద్దకు వచ్చి ఆన్‌లైన్ పరీక్షకు అవసరమైన బయోమెట్రిక్ వంటి ఫార్మాలిటీలు పూర్తి చేసుకొని వారికి కేటాయించిన సిస్టమ్ వద్ద కూర్చోవాల్సి ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తదితర వాటిని అనుమతించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు తప్పనిసరిగా ప్రభుత్వం గుర్తించిన కార్డులో ఏదైనా ఒక్కటి తీసుకొని రావాలని డిఆర్ఒ పేర్కొన్నారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ షాహిదా, ఎపిపిఎస్‌సి ఎఎస్ఒ అనిల్, తదితరులు పాల్గొన్నారు.



దేవదాయ భూ దోపిడీపై విచారణ చేయాలి : జి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలోని గత ప్రభుత్వ హయాంలో జరిగిన దేవాదాయ భూదోపిడీలపై వెంటనే విచారణ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఓర్వకల్లోని ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న జి రామకృష్ణ మాట్లాడుతూ శ్రీ కాశి రామేశ్వర స్వామి ఆలయ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వకాలు చేపట్టారన్నారు. శకునాలలోని సర్వే నంబర్ 155. 163.లో 18 ఎకరాల శ్రీ కాశి రామేశ్వర స్వామి దేవాలయ భూములలో అక్రమంగా సోలార్ రోడ్లకు వెంచర్లకు వివిధ రకాల అవసరాలకు 6నుంచి 7 అడుగుల లోతు మట్టిని తవ్వి రూ.కోట్ల దండుకున్నారన్నారు. అనేకసార్లు మండల , జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తమకు ఏమాత్రం పట్టనట్లు దేవాదాయ శాఖ అధికారులు వ్యవహరించారన్నారు. గత అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు కావడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారని అన్నారు. రెండుసార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా దేవదాయ శాఖ అధికారులు నిమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరించారన్నారు. ఆలయ భూముల పైన విచారణ జరిపి భూములను తవ్వేసిన దొంగలపై వారికి సహకరించిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న అధ్యక్షత వహించారు. ప్రజా సంఘాల నాయకులు శ్రీధర్ చంద్రబాబు నాయుడు, మధుసూదన్, చాంద్ బాషా, సుధాకర్ శకునాల గ్రామస్తులు ధర్మారెడ్డి, శివారెడ్డి, శివరాముడు ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

యూకాన్ ప్లాజ అధినేత ఇస్మాయిల్ బేగ్ ఇకలేరు

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలులో ప్రముఖ ఆర్కిటెక్ యూకాన్ ప్లాజ అధినేత ఇస్మాయిల్ బేగ్ శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్ భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. ఇస్మాయిల్‌బేగ్ కుటుంబ సభ్యులకు సానుభూమి ప్రకటించారు. మంచి సామాజిక సేవకుడిని కోల్పోయామని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ యు.నరసింహా, బుక్‌హౌజ్ ఇన్‌ఛార్జి మధు ఉన్నారు.

మంచి మిత్రుడిని కోల్పోయాం : సిపిఎం

కర్నూలు నగరంలో సిపిఎంకు మంచి మిత్రుడిని కోల్పోయిందని జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 సంవత్సరాల నుండి మంచి ఇంజినీర్‌గా కర్నూలు నగరంలో గుర్తింపు పొందిన వ్యక్తిగా, అభ్యుదయవాది అని పేర్కొన్నారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపాన్ని తెలిపిందని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించింది.

ఆవాజ్ కమిటీ సంతాపం

ప్రముఖ ఆర్కిటెక్ యూకాన్ ప్లాజ అధినేత జనాబ్ ఇస్మాయిల్ బేగ్‌కు ఆవాజ్ నగర కమిటీ అధ్యక్షులు పి. ఇక్బాల్ హుస్సేన్, ఆవాజ్ నగర కమిటీ కార్యదర్శి ఎస్ ఎం డి షరీఫ్ సంతాపం తెలిపారు. శనివారం ఇస్మాయిల్ బేగ్ తుదిశ్వాస విడిచారు. ఆయన అవాజ్ కమిటీ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. మానవతావాది, నిగర్వి, సమాజ శ్రేయస్సు కోరే, ఇస్మాయిల్‌బేగ్ అకాల మృతి చెందడం సమాజానికి తీరని లోటని అని పేర్కొన్నారు. ఆయన కుటుంబం మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ఇస్మాయిల్ బేగ్ కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు.



భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎం.ఎ.గఫూర్ (ఇన్‌సెట్‌లో ఇస్మాయిల్‌బేగ్)

చైతన్యంతోనే మహిళలకు రక్షణ

ఐద్వా సమావేశంలో నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహిళలు చైతన్యవంతమైనప్పుడే వారికి రక్షణ సాధ్యమని శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి.నిర్మల అన్నారు. శనివారం సుందరయ్య భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి. నిర్మల, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి నారాయణ మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల అనుసరిస్తున్న విధానాలను గురించి వివరించారు. కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ మహిళలకు ఏమాత్రం ఉపయోగం లేదని తెలిపారు. బంగారు ధరలు తగ్గాయంటే అవి కేవలం ధనవంతులకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. సామాన్య ప్రజలకు మహిళలకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. కొత్త ప్రభుత్వం మహిళల పరిస్థితులను గుర్తించి వారికి ఉపాధి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. సమానత్వం కావాలంటే దేశంలో స్త్రీలు మారాలి అన్నారు. రాజకీయంగా స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం లేదన్నారు. స్త్రీల కోసం ఎన్ని చట్టాలు చేసినా చిన్నపిల్లలు మొదలుకొని వయోవృద్ధుల వరకు వరకు అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల ముచ్చుమర్రిలో బాలికపై జరిగిన అత్యాచారం, హత్య ప్రభుత్వ అధికారులకు సవాలుగా నిలిచిందన్నారు. అవి అరికట్టడంలో ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందుతున్నాయని విమర్శించారు. మద్యం, బ్లూ ఫిలింలను అరికట్టిన నాడే మహిళలపై దాడులు , అత్యాచారాలు ఆగుతాయన్నారు. అభ్యుదయవాదులు కవులు, రచయితలు స్త్రీసమాజ విముక్తి కోసం రచనలు, కవితలు రాసి చైతన్య పరచాలన్నారు. చిన్నతనం నుండే మహిళలకు ఆత్మస్థైర్యాన్ని నింపే కరాటే లాంటివి నేర్పించి సమాజంలో ఎలా మెలగాలో తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలోఐద్వా జిల్లా అధ్యక్షులు అరుణ, కోశాధికారి పిఎస్. సుజాత, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి.నిర్మల



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఇందిరాశాంతి, వేదికపై సిఇఒ పివి.రమణ తదితరులు

ప్రకృతి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- సెట్కూరు సిఇఒ పివి రమణ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

ప్రకృతిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సెట్కూరు సిఇఒ పివి రమణ అన్నారు. శనివారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని యువజన సర్వీసుల శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో బి. క్యాంప్ లోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జరిగిన సెమినార్ లో ఆయన పాల్గన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతి పరిరక్షణకు అన్ని దేశాలు, ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయని, పరిశోధనలు కూడా నిర్వహిస్తున్నాయని అన్నారు. ప్రకృతి పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, విద్యుత్ శక్తిని ఆదా చేసే ఎల్ఇడి లాంటి ఉపకరణాలను వాడాలని, ప్రకృతి వ్యవసాయం చేయటం ద్వారా కార్బన్ రహిత జీవన శైలికిఅందరం కృషి చేయాలనీ తెలిపారు. ప్రిన్సిపల్ ఇందిరా శాంతి మాట్లాడుతూ ప్రకతి ఇచ్చిన సహజ వనరులను కాపాడుకోవడం, పర్యావరణాన్ని పరిరక్షించడం అనే లక్ష్యంతో ఈ దినాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్ మేకింగ్ ప్రసెంటేషన్, ఎక్సిబిషన్ ఆకట్టుకున్నది. దాదాపు 250 మంది విద్యార్థులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ జె.హేమంత్, అధ్యాపక బృందం, సెట్కూరు సూపరింటెండెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు

రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలో ఎవరైనా అక్రమంగా మైనింగ్ త్రవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ శనివారం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 22న కర్నూలు మండలం దిన్నదేవరపాడు, జగన్నాథ గట్టుపై అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న వడ్డేశంకర్, వడ్డేలక్ష్మీదేవిలకు చెందిన జెసిబి వాహనాన్ని సీజ్ చేసామన్నారు. వాహనాన్ని కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. వాహన యజమానులు హైకోర్టులో రిట్ పిటిషన్ వేసుకోగా సంబంధిత కేసులో వాహనదారులపై రూ. రెండు లక్షలు జరిమాన విధిస్తూ వాహనాన్ని రిలీజ్ చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఈ మేరకు వాహన యజమానుల నుంచి రూ.2 లక్షల డిడి రూపంలో ప్రభుత్వానికి జమ చేసామన్నారు. ఎవరైనా జిల్లాలో అక్రమ తవ్వకాలు నిర్వహించడం, తరలించడం, చేసినట్లయితే భారీ జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సామాజిక తనిఖీలో అక్రమాలు బహిర్గతం

ప్రజాశక్తి - దేవనకొండ

సామాజిక తనిఖీ ప్రజావేదిక సభలో అక్రమాలు బహిర్గతమయ్యాయి. మండలంలో 2023 ఏప్రిల్ నెల నుంచి 2024 మార్చి నెల వరకు ఉపాధి హామీ చట్టం కింద జరిగిన పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జీ ఎంపిడిఒ ఇద్రూస్ బాషా అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, వాటర్ షెడ్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి లత, ఏపీడీ పక్కీరప్ప, ఎస్ఆర్‌పి ఆవులయ్య హాజరయ్యారు. మండలంలో 1,423 పనులకు ఖర్చు పెట్టిన రూ.9.71 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖలో జరిగిన 25 పనులకు ఖర్చు పెట్టిన రూ.2.94 కోట్లకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో నిర్వహించిన నివేదిక వివరాలను డిఆర్‌పిలు వివరించారు. ఉపాధి పనుల్లో గుర్తించిన అక్రమాలు, రికవరీ కింద రూ.42,218, అపరాధ రుసుం కింద రూ.97 వేలు అక్రమాలు జరిగినట్లు వెల్లడించారు. రికవరీ చెల్లించాలని జూనియర్ ఇంజనీర్ రంగస్వామిని పీడీ ఆదేశించారు. ఇంజనీర్ ఒప్పుకోకుండా పీడీతో వాగ్వాదానికి దిగారు. అక్కడ ఉన్న మిగిలిన అధికారులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఏపిఒ కృష్ణమూర్తి, జూనియర్ ఇంజనీర్ రంగస్వామి పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న పీడీ అమర్‌నాథ్ రెడ్డి

అభివృద్ధి ప్రదాత బీవీ.మోహన్ రెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అభివృద్ధి ప్రదాత కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి కొనియాడారు. శనివారం మాజీమంత్రి, కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక సోమప్ప సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడారు. పద్మశ్రీ మాచాని సోమప్ప తర్వాత ఎమ్మిగనూరు ప్రజలకు గుర్తుకొచ్చే ఏకైక వ్యక్తి బీవీ.మోహన్ రెడ్డి అని తెలిపారు. నియోజకవర్గంలో అనేక గ్రామాలకు తాగు, సాగునీరు, పట్టణంలో రెండు పూటలా తాగునీరు అందించిన ఘనత తమ తండ్రి బీవీ.మోహన్ రెడ్డిదని చెప్పారు. ఆయన ఆశల కోసమే తాను రాజకీయాల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు. తన తండ్రి తుదిశ్వాస వరకు కార్యకర్తలకు అండగా నిలబడ్డారని, తాను కూడా తన తండ్రి బాటలోనే నిలుస్తానని చెప్పారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పట్టణ నాయకులు తురేగల్ నజీర్ అహ్మద్, కొండయ్య చౌదరి, రంగస్వామి గౌడ్, రామకృష్ణ, మహబూబ్ బాషా, రషీద్, మధుబాబు, నందవరం మండల నాయకులు గురు రాజ్ దేశాయి, నారాయణరెడ్డి, ఖాసీం వలీ, గోనెగండ్ల మండల నాయకులు నజీర్ అహ్మద్, తిరుపతయ్య నాయుడు, కృష్ణమ నాయుడు, మదీనా, రహంతుల్లా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

త్వరగా జగనన్న కాలనీ పూర్తి

- హౌసింగ్ పీడీ సిద్ధలింగ మూర్తి

ప్రజాశక్తి - ఆస్పరి

జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లను త్వరగా పూర్తి చేస్తామని హౌసింగ్ పీడీ సిద్ధ లింగ మూర్తి తెలిపారు. శనివారం ఆస్పరిలోని జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇల్లు లేని 29 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం హయాంలో ఇల్లు మంజూరయిందని తెలిపారు. 18 మంది లబ్ధిదారులు మాత్రమే బేస్ మట్టం వరకు కట్టుకున్నారని చెప్పారు. మిగతా 11 మంది లబ్ధిదారులు ఎందుకు కట్టుకోవడం లేదని హౌసింగ్ ఇన్‌స్పెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ... రాయి, ఇసుక, బేల్దార్ కూలిలు అధికంగా పెరగడంతో కట్టుకోలేక పోతున్నామని, తమరే కట్టించి ఇవ్వాలని లబ్ధిదారులు అడుగుతున్నారని తెలిపారు. లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి బేస్‌మట్టం వరకు నిలబడిన ఇళ్లను త్వరగా పూర్తి చేసేలా చూడాలని పీడీ ఆదేశించారు. అనంతరం హాలిగేరా గ్రామంలో పర్యటించి, ఇళ్లను పరిశీలించారు. బిపిఎల్, లింటెల్, రూఫ్ లెవెల్ వరకు పడని బిల్లులు త్వరలో పడుతాయన్నారు. హౌసింగ్ ఇన్‌ఛార్జీ ఎఇ దర్గయ్య, వర్క్ ఇన్ స్పెక్టర్లు హుస్సేన్ బాషా, వెంకటేశ్వర్లు, ఇంజినీర్ అసిస్టెంట్ లక్ష్మన్న పాల్గొన్నారు.


ఆస్పరిలోని జగనన్న కాలనీని పరిశీలిస్తున్న పీడీ సిద్ధ లింగ మూర్తి

సబ్ కలెక్టర్ రాకతో అధికారులు బెంబేలు

- పని చేయలేక పోతే రాజీనామా చేసి వెళ్లిపోండి - సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ - వివిధ శాఖల అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం

ప్రజాశక్తి - నందవరం

ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ రాకతో అధికారులు తాము చేసిన తప్పులు ఎక్కడ బయటపడతాయోనని బెంబేలెత్తిపోయారు. శనివారం మండలంలోని హాలహర్వి గ్రామంలో రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించకపోతే వంట ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఎంఇఒను ఆదేశించారు. అలాగే అంగన్వాడీ కేంద్రం-4లో 18 మంది పిల్లలు వచ్చినట్లు హాజరు వేయగా పదిమంది ఉండడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ ఏం చేస్తున్నారని, ఇది మళ్లీ జరిగితే ఇద్దరినీ సస్పెన్షన్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాస్పత్రిని సందర్శించి రక్తపరీక్షలు ఏవిధంగా చేస్తున్నారని, రోజూవారీగా ఎంతమంది ఆస్పత్రికి వస్తున్నారని, ఆస్పత్రిలో ఏయే సేవలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేశాయి చెరువును పరిశీలించి, చెరువులోని మట్టి తరలింపును వెంటనే నిలిపివేయాలని, చెరువులో ఉన్న జెసిబి, 4 ట్రాక్టర్లను సీజ్ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. మండలంలోని రైతులకు సాగు, తాగునీటికి ఇబ్బంది రాకుండా ఎప్పటికప్పుడు చెరువులు, కుంటలను నింపుకొని నీటి సరఫరా చేయాలన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయించి, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లి కాలువలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. అలాగే ఆయా శాఖల అధికారులతో తనదైన శైలిలో ప్రశ్నలు సంధించడంతో సమాధానాలు చెప్పలేక సచివాలయ, ఇతర శాఖ అధికారులు తలలు పట్టుకున్నారు. ఇలాంటి తప్పులు మళ్లీ జరగకూడదని, జరిగితే సస్పెన్షన్ చేస్తామని హెచ్చరించారు. డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, డిఎల్‌పిఒ నూర్జహాన్, ఎంపిడిఒ కిరణ్ మోహన్ రావు, తహశీల్దార్ ఓబులేసు, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, సర్పంచి తిమ్మప్ప, ఎంఇఒ రఘునాథ్, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు జయన్న, వెంకటరాముడు పాల్గొన్నారు.


అంగన్వాడీ కేంద్రంలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పరిసరాలను అపరిశుభ్రం చేస్తే చర్యలు

- కమిషనర్ రామచంద్రరెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పరిసరాల అపరిశుభ్రత కారణంగానే సీజనల్ వ్యాధులు సోకుతున్నాయని, అలాంటి వాటికి ఆస్కారం కలిపిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని కౌడల్ పేట, మాలగేరి, కార్వాన్ పేట ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెత్తాచెదారం డ్రెయినేజీల్లో వేయడం వల్ల నీరు పారకుండా నిల్వ ఉంటున్నాయని తెలిపారు. దోమలు వృద్ధి చెంది వ్యాధుల వ్యాప్తికి ఆస్కారం ఏర్పడుతోందన్నారు. పశువులను ఎక్కడపడితే అక్కడ ఉంచడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని తెలిపారు. పశువుల నుంచి వెలుబడిన మలీనాలను పశువుల కాపరులు ఎప్పటికప్పుడు ఊరు బయటకు తరలించి, ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు సూచించారు. కొత్తనీరు కలవడం వల్ల రంగు మారిన నీరు వస్తున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. కాచి వడబోసిన తర్వాతనే నీరు తాగాలని కమిషనర్ రామచంద్ర రెడ్డి ప్రజలకు వివరించారు.


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రామచంద్రరెడ్డి

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి

- జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్
- సెబ్ పోలీసు స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-ఆదోని

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సెబ్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలని కర్నూలు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. శనివారం ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు పోలీసు స్టేషన్లలో లాకప్ గదులు, కంప్యూటర్ రూము రికార్డులను పరిశీలించారు. చేసే ఆయా పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. సిబ్బంది విధులు, వారి సాధకబాధకాలపై ఆరా తీశారు. శాఖ ప్రతిష్టను పెంచే విధంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. స్టేషన్ ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు స్టేషన్లకు సంబంధించిన ఫైళ్లను, పలు రిజిస్టర్లను పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు ఏ విధంగా జరుగుతున్నది ఆరా తీశారు. ఈ కేసుల ఛేదనకు దోహదపడే దర్యాప్తు విధానాలపై పలు సూచనలు చేశారు. రికార్డులు పెండింగ్ లేకుండా సక్రమంగా నిర్వహించాలని, వివిధ కేసుల్లో సీజ్ చేసిన ప్రాపర్టీని అధికారుల అనుమతితో త్వరగా డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. నాటుసారా, అక్రమ ఇసుక, మట్కా, జూదం నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో విధిగా పర్యటించాలని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. సిఐ విన్నీ లత, భార్గవరెడ్డి, స్వర్ణలత, సోమశేఖర్, మహ్మద్ బాష పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న రవికుమార్

వైసిపి సీనియర్ నాయకునికి ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శ

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని మొలగవల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న వైసిపి సీనియర్ నాయకులు వాల్మీకి రామాంజనేయులును శనివారం ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శించారు. రామాంజనేయులు కాలుకు ఇన్ఫెక్షన్ కావడం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్న ఆయనను చూసి ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకొని మళ్లీ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

కేంద్ర బడ్జెట్ ధనవంతులకు దాసోహం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ధనవంతులకు దాసోహంగా మారిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు తెలిపారు. శనివారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో రాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, సిపిఎం నాయకులు పి.గోవిందు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారానికి అవసరమైన మెజార్టీ లేకుండానే ఎన్‌డిఎ తోడ్పాటుతో అధికారంలోకి వచ్చిందని తెలిపారు. భారతదేశ లౌకిక, ప్రజాతంత్ర విధానాలకు తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బిజెపి తన బలాన్ని కోల్పోయిందని తెలిపారు. దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్ తప్ప మిగతా రాష్ట్రాల్లో కూడా బలహీనమైందని చెప్పారు. నేటికీ బిజెపి తన మతతత్వ అజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2024-25 బడ్జెట్‌లో వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి, కార్మిక రంగాలకు సంబంధించిన కేటాయింపులు దేశాభివృద్ధికి, ఆర్థిక పురోభివృద్ధికి ఏమాత్రం దోహదపడవని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు, రాష్ట్ర విభజన హామీల అమలుకు తగిన ప్రాధాన్యత కేంద్ర బడ్జెట్‌లో ఇవ్వలేదని విమర్శించారు. ఎమ్మిగనూరు పరిధిలో ప్రజాసేవ నిమిత్తం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. శివారు కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు సురేష్, అబ్దుల్లా, కృష్ణ, సుభాన్, నామాల రాముడు, తిమ్మప్ప, రమేష్, రవి, ఉస్మాన్ వలీ, దేవేంద్ర మూర్తి, రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, నాయకులు విజయ, కెవిపిఎస్ నాయకులు ఆంథోని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు


తనిఖీలు నిర్వహిస్తున్న ఎఒ అశోక్‌కుమార్‌రెడ్డి

నిషేధిత పురుగు మందు రవాణాపై నిరంతరం నిఘా : ఎఒ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నిషేధిత పురుగు మందు రవాణాపై నిరంతరం నిఘా ఉంచినట్లు ఎఒ అశోక్‌రెడ్డి తెలిపారు. కలుపు నివారణ మందులు కొంతమంది డీలర్లు నిషేధిత గ్లైసిల్, గ్లైఫోసైట్, రౌండప్ రెడీ రవాణా చేస్తున్నట్లు సమాచారం మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, కర్నూలు జెడి వరలక్ష్మి ఉత్తర్వుల మేరకు పట్టణంలోని వివిధ ట్రాన్స్ పోర్ట్ ఏజెన్సీల్లో ఎఒ సి.అశోక్ కుమార్ రెడ్డి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిషేధిత గడ్డి మందు గ్లైపోసిట్ కోసం, నిషేధిత అనుమతి లేని పురుగుమందు కోసం ఈ తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలకు కూడా నిషేధిత గడ్డి పురుగు మందు రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందు డీలర్లకు కూడా నిషేధిత జాబితాలో ఉన్న పురుగుమందును, ఎరువులను అమ్మకూడదని ఆదేశాలు జారీ చేశారు.

పన్నులు చెల్లించి సహకరించండి : సర్పంచి


మాట్లాడుతున్న సర్పంచి పాల్ దినకరన్

ప్రజాశక్తి - కౌతాళం

మేజర్ పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న వారు పంచాయతీకి బకాయి ఉన్న ఇంటి పన్ను చెల్లించి సహకరించాలని సర్పంచి పాల్ దినకరన్, పంచాయతీ కార్యదర్శి శివప్ప కోరారు. శనివారం వారు మాట్లాడారు. ఇంటి పన్ను, నీటి కుళాయి పన్ను, వ్యాపారులు లైసెన్స్ పన్ను, ప్రజలు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

'డిగ్రీ అడ్మిషన్ కోసం వెబ్ ఆప్షన్ ఎంచుకోండి'

ప్రజాశక్తి - ఆలూరు

ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్ కోసం వెబ్ ఆప్షన్ ఎంచుకోవాలని ఆలూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్ శనివారం తెలిపారు. ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బిఎ-హిస్టరీ, బికాం-కంప్యూటర్, బీఎస్సీ- జువాలజీ గ్రూపులకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మొదటి వెబ్ ఆప్షన్ ఎంచుకోవాలని తెలిపారు.

నైట్ వాచ్‌మేన్‌ను నియమించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

తహశీల్దార్ కార్యాలయంలో నైట్ వాచ్‌మేన్‌ను నియమించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో నెలకొన్న సమస్యలపై తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యాలయానికి ప్రహరీ వాల్ నిర్మించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, పరమేష్, ఈరన్న పాల్గొన్నారు.


ముళ్ల కంపను తీయిస్తున్న ఎంపిడిఒ లక్ష్మీనారాయణ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆస్పరి

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ లక్ష్మీనారాయణ ప్రజలకు సూచించారు. శనివారం మండలంలోని హాలిగేర, బినిగేరి, బనవనూరు, పుట్టకల మర్రి గ్రామాల్లో ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, తహశీల్దార్ ఈరమ్మ, పిఆర్ ఎఇ యమునప్ప, ఎస్సీ ఆర్‌డబ్ల్యుస్ నాగేశ్వర్ నాలుగు టీములుగా విడిపోయి పర్యటించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన రహదారులను పరిశీలించి, రోడ్డుకిరువైపులా మునిగిపోయిన డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. వాటర్ ట్యాంకు సమీపంలో పెరిగిన ముళ్లకంపను తొలగించారు. మురుగు నీరు రోడ్లపై నిల్వ లేకుండా, చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయరాదని సూచించారు. నెలలో రెండుసార్లు ట్యాంకును శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు చిన్న వెంకటేష్, జంప్ల నాయక్, నాగమణి, టిడిపి ఎంపిటిసి రహీంతుల్లా, నాయుడు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

- భీమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని భీమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల సెక్రటరీ పిఎన్.విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. శనివారం ఆదోనిలోని భీమాస్ కళాశాలలో ప్రిన్సిపల్ సురేంద్ర బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. చెట్లను నరికి వేయడం ద్వారా కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఆల్‌బర్ట్, ఉదయ్ కిరణ్, శివమ్మ, పిటి రాజు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటాం

- జనసేన పార్టీ ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప

ప్రజాశక్తి- దేవనకొండ

జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రుల సహాయ, సహకారాలతో ఆలూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని జనసేన పార్టీ ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. శనివారం దేవనకొండలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన రూ.15 వేల కోట్లతో రాజధాని అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇరిగేషన్, పౌరసరఫరాలు, శానిటేషన్, అటవీ శాఖ, పర్యాటక శాఖ మంత్రుల సహకారంతో నియోజకవర్గంలో ఆయా శాఖల పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు వెళ్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చొరవ చూపుతామన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇంటింటి కుళాయిల ఏర్పాటు, జింకల బెడద నుంచి పంటలను కాపాడడానికి జింకల పార్కు ఏర్పాటుకు సంబంధిత అటవీశాఖ అధికారులతో చర్చిస్తామని తెలిపారు. ఆక్రమణలకు గురైన భూముల పరిరక్షణకు, ఇసుక దందా నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతినెలా 15 రోజులకోసారి జన వాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జనసేన పార్టీ మండల నాయకులు వీరేష్, జగదీష్, ఆంథోని, బడే సాబ్, ఉచ్చీరప్ప, రామాంజనేయులు, రాజు, నందు, జనసేన వీర మహిళ నేతలు సరోజ, హబీబా పాల్గొన్నారు.



జనసేన సభ్యత్వ నమోదు చేయిస్తున్న వెంకప్ప


పరామర్శిస్తున్న బుట్టా రేణుక

అడ్వకేట్ జయన్న కుటుంబానికి మాజీ ఎంపీ బుట్టా రేణుక పరామర్శ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని పార్లపల్లి గ్రామం వైసిపి నాయకులు, అడ్వకేట్ జయన్న కుటుంబాన్ని మాజీ ఎంపీ, వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక శనివారం పరామర్శించారు. జయన్న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి పార్టీ, తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. అలాగే సింగిల్‌విండో మాజీ ఛైర్మన్, వైసిపి నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి సత్యానారాయణరెడ్డి తల్లి మృతి చెందిన తెలిసిందే. వారి తల్లి ఆర్.సరస్వతమ్మ వైకుంఠ సమారాధనలో బుట్టా రేణుక పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, బిఆర్.బసిరెడ్డి, భీమిరెడ్డి, లక్ష్మి కాంత్ రెడ్డి, ముతతి విరుపాక్షి రెడ్డి, పేట శ్రీనివాస్ రెడ్డి, పాల శ్రీనివాస్ రెడ్డి, కోటేకల్ లక్ష్మన్న, మహబూబ్ బేగ్, ఫయాజ్ పాల్గొన్నారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం సమీపంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నది వరద ప్రవాహం శనివారం కూడా కొనసాగుతోంది. కర్ణాటక రాష్ట్రంలోని ఎగువన కురుస్తున్న వర్షాలకు హోస్పేట్ డ్యామ్ వరద నీటితో నిండిపోయింది. దిగువకు నీటిని విడుదల చేయడం వల్ల తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం 1,07036 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పుష్కర ఘాట్ మీదుగా ప్రవహిస్తూ రాత్రికి మెట్ల వరకు వచ్చే అవకాశం ఉందని శ్రీమఠం అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు శనివారం తెలిపారు. భక్తులు, గ్రామస్తులు నదిలోకి వెళ్లకుండా పోలీసు సిబ్బందితో పాటు శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బంది భద్రత ఏర్పాటు చేశారు.

భక్తుల సౌకర్యార్థం షవర్ బాత్‌లు

భక్తుల స్నానాల సౌకర్యార్థం తుంగభద్ర నది తీరంలో షవర్ బాత్‌లు ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా తుంగభద్ర నదికి వరద నీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు శనివారం శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే సూపర్‌వైజర్ పురాణిక రాఘవేంద్ర చార్ ఆధ్వర్యంలో విద్యుత్ మోటార్‌ను ఏర్పాటు చేసి షవర్లకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. 25 షవర్లు ఏర్పాటు చేసి భక్తుల స్నానాలకు అవకాశం కల్పించారు. శ్రావణ మాసంలో జరగనున్న రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు మరో 25 షవర్లు ఏర్పాటు చేస్తామని పురాణిక రాఘవేంద్ర చార్ తెలిపారు.


షవర్ బాత్‌లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

జిఒ 217 రద్దుపై హర్షం

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ

పజాశక్తి - ఆదోని

మత్స్యకారులకు ఇబ్బందిగా ఉన్న జిఒ 217ను ప్రభుత్వం రద్దు చేయడంపై మత్స్య కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శనివారం ఆదోనిలోని స్వగృహం వద్ద మత్స్యకారులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ జిఒ ద్వారా టెండర్లు దక్కించుకున్న వారికి చేపలు పట్టుకునే హక్కు లభించేదన్నారు. దీనిపై గతంలో విపక్షాలుగా ఉన్న జనసేన, టిడిపి పోరాటాలు చేశాయన్నారు. మత్స్యకారులకు సొంతూళ్లలో చేపలు పట్టుకునే అవకాశం లేకుండా చేసిందని విమర్శించారు. ఏళ్ల తరబడి చెరువుల్లో చేపలు పట్టుకుని జీవించే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళనలు చేపట్టారని తెలిపారు. వంద ఎకరాల కంటే ఎక్కువ ఉన్న చెరువులకే ఈ జిఒ వర్తిస్తుందని అప్పటి వైసిపి ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. మత్స్యకారుల అభ్యున్నతి కోసమే జిఒ 217ను జారీ చేసినట్లు చెప్పుకొచ్చిందని తెలిపారు. ఇక హామీ మేరకు త్వరలోనే ఏపి మంత్రివర్గ సమావేశంలో జిఒ 217ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. మత్స్యకారుల సంఘం మండల నాయకులు ఓంకార్, ఆంజనేయ, లక్ష్మణ్, కోడిదూడల ఆంజనేయ, వీరేష్, పంపన్న, హనుమంతు, ఆంజనేయ, బుచ్చాపా గౌరి జకప్ప, బెస్త వీరేష్ పాల్గొన్నారు.


గుడిసె ఆది కృష్ణమ్మను సన్మానిస్తున్న నాయకులు

అసమానతల్లేని సమాజ నిర్మాణమే అంబేద్కర్ ఆశయం

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

జ్ఞానవంతమైన, అసమానతలు లేని సమాజ నిర్మాణమే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయమని, ఆ ఆశయాన్ని ముందుకు తీసుకు పోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు మునిస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కులం కారణంగా దేశంలో అంటరానితనం, అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. వాటిని జ్ఞానవంతమైన సమాజం మాత్రమే మార్చగలదని అంబేద్కర్ బోధించారని చెప్పారు. తన జ్ఞానం ద్వారా, ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకున్న అంబేద్కర్, ప్రతి అవకాశాన్ని సమాజ మార్పు కోసం, సమాన అవకాశాల కోసం ఉపయోగించారని తెలిపారు. ఎన్ని హక్కులు సాధించి పెట్టినా, నేటికీ కొనసాగుతున్న మనువాద భావజాలం కారణంగా, నేటికీ దళితులను రెండో తరగతి పౌరులుగానే చూస్తున్న పరిస్థితి ఉందని చెప్పారు. అంబేద్కర్ ఆశయ సాధనలో ముందున్న కెవిపిఎస్ సామాజిక ఉద్యమకారులనంతా ఐక్యం చేసి ఈనెల 30, 31న ఆదోని మండలం సంతకుడ్లూరు గ్రామంలో సామాజిక చైతన్య శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని, వాటి జయప్రదానికి సహకరించాలని కోరారు. తిక్కప్ప, తాయప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్ బాబు

ఎస్‌టియు రాష్ట్ర కన్వీనర్‌గా వీరచంద్ర యాదవ్

ప్రజాశక్తి - ఆదోని



ఎస్‌టియు రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్‌గా ఆదోని పట్టణ నాయకులు వీరచంద్ర యాదవ్ ఎన్నికయ్యారు. శనివారం ఆదోనిలోని ఎస్‌టియు కార్యాలయంలో సమావేశంలో ఎస్‌టియు పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, భీమరాజు, రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, ఎస్‌టియు నాయకులు రమేష్ నాయుడు, లోక్య నాయక్ మాట్లాడారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆయన సేవలను గుర్తించి ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలు, మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, సర్వీసు రూల్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వీరచంద్ర యాదవ్ తెలిపారు.

సచివాలయంలో బాబు, పవన్ ఫొటోలు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని చింతకుంట సచివాలయంలో ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేయడంపై కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తర్వాత అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలను విధిగా ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో పాటు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే చింతకుంట సచివాలయంలో నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి పార్టీలకు చారిత్రక విజయాన్ని కట్టబెట్టారని తెలిపారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బిజెపి మండల అధ్యక్షులు బసవరాజు, జనసేన మండల కన్వీనర్ చంద్ర, టిడిపి నాయకులు ఉమాకాంత్ స్వామి, గౌస్ పాల్గొన్నారు.